క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు పునఃసమీక్ష చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో జైభీం సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలితం శంకర్, ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, ఉపాధ్యక్షుడు నర్సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



వైద్యుల హాజరు పరిశీలిస్తున్న హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రులకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం తనిఖీ చేసి, వైద్యులు, వైద్య సిబ్బంది రిజిష్టర్‌ను పరిశీలించి, వారి సమయపాలన పాటిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. మంచిర్యాల పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బందితో చేయిస్తున్న సర్వే రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శివప్రతాప్, వెంకట్‌సాయి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

బెల్లంపల్లిరూరల్(తాండూర్)/లక్సెట్టిపేట/కోటపల్లి/జన్నారం: వినాయక నిమజ్జనాలకు డీజేలు అనుమతి లేదని లక్సెట్టిపేట, తాండూర్, కోటపల్లి, జన్నారం మండలాల్లో డీజే నిర్వాహకులను బైండోవర్ చేశారు. డీజే సౌండ్ సిస్టమ్ వినియోగిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. శోభాయాత్రలను భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ వాయిద్యాలతో నిర్వహించాలని సూచించారు. మాదారం ఎస్సై సౌజన్య తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ముందు బైండోవర్ చేయగా, లక్సెట్టిపేటలో ఎస్సై సతీష్ ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ దిలీప్ ముందు హాజరుపర్చినట్లు తెలిపారు. జన్నారంలో 8మంది డీజే నిర్వాహకులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. కోటపల్లిలో ఎస్సై రాజేందర్ పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేశా రు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డీజేలు పెడితే కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

సింగరేణి స్థాయి పోటీల్లో రాణించాలి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: నియర్ బై ఏరియా స్థాయి పోటీల్లో గెలిచిన వారు సింగరేణి స్థాయి పోటీల్లో రాణించాలని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి ఏరియాలోని సీఈఆర్, సింగరేణి స్కూల్ ఆవరణలోని జిమ్‌లో నిర్వహించిన నియర్ బై ఏరియా స్థాయి ఇండోర్ గేమ్స్‌ను ప్రారంభించారు. ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా పీఎం శ్యామ్‌సుందర్, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి కార్తీక్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ శివకృష్ణ ఉన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పనులు పరిశీలిస్తున్న డీపీవో కల్పన

భీమారం: గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీపీవో, మండల ప్రత్యేక అధికారిని కల్పన అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆమె పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు.



బెల్లంపల్లిరూరల్(తాండూర్): పూజలు చేస్తున్న భక్తులు



ఆస్నాదలోని నడింవాడ వినాయకుడి వద్ద కుంకుమ పూజలు




మంచిర్యాలఅర్బన్: నవధాన్యాలతో కొలహాపూర్ అమ్మవారు అలంకరణ

బొజ్జ గణపతికి ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్‌రూరల్/రామకృష్ణాపూర్/బెల్లంపల్లిరూరల్(తాండూర్)/మందమర్రిరూరల్/చెన్నూర్/భీమిని/బెల్లంపల్లి: వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా వివిధ మండపాల్లో స్వామివారి భక్తులు అర్చనలు, అభిషేకాలు, మంగళహారతులతో కొలిచారు. సామూహిక పారాయణాలు, భజనలు ఆలపించారు. అన్నదానం నిర్వహించారు. ఫల పంచామృత అభిషేకం, సముద్ర జల నదీ జలాలతో అష్ట ద్రవ్యాలతో స్వామి వారికి విశేష పూజలు జరిపారు. జిల్లా కేంద్రంలోని సీతారామా కాలనీలో భక్తాంజనేయ శివ పంచాక్షరి దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. విశ్వనాథస్వామి కాలక్షేప మండపంలో ఆర్యవైశ్య, వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం, వినాయకునికి పుష్పాలంకరణ, అష్టాదవ శక్తిపీఠాల పారాయణం కార్యక్రమం నిర్వహించారు. నవధ్యాన్యాలతో మహిళలు వేసిన కోలాహపూర్ అమ్మవారి అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని సిద్ధి వినాయక గణేశ్ మండలి వద్ద, ఆస్నాదలోని నడింవాడలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. రామకృష్ణాపూర్‌లోని బీజోన్ విజయ గణపతి ఆలయంలో గణనాథుడికి 108రకాల నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. తాండూర్ బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన గణేష్ భక్త మండలి వినాయక మండపంలో భక్తులు 121 రకాల నైవేద్యాలు సమర్పించారు. బెల్లంపల్లి హన్మాన్ బస్తీలో నిర్వహించిన అన్నదానంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.



రామకృష్ణాపూర్: గణనాథుడికి సమర్పించిన నైవేద్యాలు



మంచిర్యాల ఎల్‌సీవి కాలనీలో అభిషేక పూజలు



మంచిర్యాలఅర్బన్: హరిఓం గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజల్లో భక్తులు



చెన్నూర్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



మంచిర్యాలఅర్బన్: మట్టి వినాయకుడి వద్ద పూజలు



విశ్వనాథ ఆలయం వద్ద హోమం



మంచిర్యాలఅర్బన్: బస్టాండ్ వద్ద అన్నదానం కార్యక్రమంలో భక్తులు



బెల్లంపల్లి: అన్నం వడ్డిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవయ్య



మందమర్రిరూరల్: హమాలీ సంఘం ఆధ్వర్యంలో...

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: నేషనల్ హైవే 63రహదారి హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే కాకుండా బ్రౌల్‌ఫీల్డ్ అయిన పాత రోడ్డు ప్రకారమే రోడ్డు అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు బుధవారం కలెక్టర్ కుమార్‌దీపక్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తులమధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్ నుంచి గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లతో ధరణి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రతీరోజు ధరణి దరఖాస్తులు పరిశీలించాలని, మండల స్థాయిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

13న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాల లక్సెట్టిపేట్ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాంబమూర్తి, కార్యదర్శి మారయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 19, 20 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 14, 16, 18, 20 ఏళ్లలోపు బాల బాలికలకు పోటీలు ఉంటాయని, పోటీలకు వచ్చే క్రీడాకారులు వారి జనన ధృవీకరణ పత్రాలతో 13న ఉదయం 7:30 గంటలకు కళాశాల పీడీ నాంపల్లి, పీఈటీ రాజేశ్‌లకు రిపోర్టు చేయాలని తెలిపారు.

కొనసాగుతున్న జ్వరసర్వే



జ్వర సర్వే చేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో గల రాంనగర్‌లో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ఇంటింటి జ్వర సర్వేను నిర్వహించారు. జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించి, వారికి మందులు అందజేసి, మూడు రోజుల కంటే ఎక్కువ జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించి టీహబ్‌కు పంపినట్లు డాక్టర్ అనిత తెలిపారు.

అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం



జన్నారంలో అటవీ అధికారుల ర్యాలీ



చెన్నూర్: నివాళులర్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

చెన్నూర్: విధి నిర్వహణలో అమరులైన దివంగత ఫారెస్ట్ అధికారులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని చెన్నూర్ నీల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్పలకొండ అన్నారు. అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరులకు నివాళులర్పించారు. అమరుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చెన్నూర్, నీల్వాయి, కోటపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు సదానందం, ప్రభాకర్, ప్రమోద్, లావణ్య పాల్గొన్నారు.

జన్నారం: అటవీ అమర వీరుల దినోత్సవాన్ని జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. అటవీ శాఖ ఉద్యోగులు ర్యాలీ తీశారు. ఎఫ్ఆర్వో సుష్మారావు మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణులను రక్షించడానికి విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో తిరుపతి, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

కోటపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్ అన్నారు. మండలకేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేయించాలని, ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, ఉపాధ్యక్షుడు పున్నం, నాయకులు కందుల వెంకన్న, దుర్గం నర్సింహులు పాల్గొన్నారు.

భీమిని: బీజేపీలో అందరూ సభ్యులుగా చేరాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ భవిష్యత్ కోసం బీజేపీని బలపర్చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామన్నయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, మాజీ సర్పంచ్ రాజయ్య, నాయకులు అజ్మీర శ్రీనివాస్, గోమాస దేవాజీ తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లిలో మాట్లాడుతున్న ఏమాజీ

టీఎన్జీవోస్ సమావేశంలో జిల్లా నాయకులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని నాంపల్లి కేంద్ర సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించగా, జిల్లా నాయకులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో వెళ్లిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపాలని, వీఆర్వో, వీఆర్ఏలను మాతృశాఖకు పంపి, వారి నెల జీతాలను చెల్లించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ వ్యవస్థను రద్దు చేసి, పాత పెన్షన్ వ్యవస్థను అమలు చేయాలని కోరారు. 317జీవో బాధితుల సమస్యలను పరిష్కరించి, పీఆర్సీ అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న 4డీఏలను వెంటనే ఇవ్వాలని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

యూఆర్ఎస్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యుఆర్ఎస్) మంచిర్యాలలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టులకు (కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు) అర్హత కలిగిన జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈ నెల 12నుంచి 17వరకు ఐడీవోసీలో రూం నంబర్-17 జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. హెడ్‌కుక్ పోస్టు కోసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టు కోసం ఏడో తరగతి అర్హత కలిగి ఉండాలన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్(తాండూర్): ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్గో ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ బి.పాల్ అన్నారు. తాండూర్ ఐబీలో బుధవారం సాయంత్రం కార్గో సేవలను ఆయన ప్రారంభించారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల సాయిబాబా ఆలయానికి బుధవారం పట్టణానికి చెందిన మాదంశెట్టి సత్యనారాయణ, చిలువేరు శ్రీనివాస్ మిత్రబృందం రూ.లక్ష విరాళం అందజేశారు.

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ సీపీఐ జెండా ఆవిష్కరించారు.

సీఎంకు ఉద్యోగుల వినతి

మంచిర్యాలటౌన్: తెలంగాణ గృహ నిర్మాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల సర్దుబాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. సీఎం సానుకూలంగా స్పందించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పెద్దపల్లి సత్యనారాయణ, రాం శ్రీనివాస్, దుర్గరాజ్, నారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రతిరోజూ శానిటేషన్ చేయాలి

లక్సెట్టిపేట: గ్రామాల్లో ప్రతి రోజూ శానిటేషన్ చేయాలని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట, దౌడపల్లి, పాతకొమ్ముగూడెం, కొత్తకొమ్ముగూడెం గ్రామాల్లో బుధవారం పర్యటించి మాట్లాడారు. వర్షాకాలం కావడంతో వైరల్ ఫీవర్స్ చాలా ఎక్కువగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి శ్రీనివాస్

శ్రీరాంపూర్: మాల మహానాడు మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరాంపూర్‌కు చెందిన గుమ్మడి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

'ఆరోపణలు మానుకోవాలి'

చెన్నూర్: కోటపల్లి మండలం నక్కలపల్లి లోతువాగుపై వంతెన నిర్మాణాన్ని వివేక్ వెంకటస్వామి పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెన్నూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్మ రాజమల్లగౌడ్, హిమవంతరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లోతువాగుపై వంతెన నిర్మాణానికి రూ.28లక్షల నిధులు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

మైనింగ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ(ఏఐటీయూసీ)ని ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా గనిపై బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. ఫిట్ సెక్రెటరీగా దీక్షిత్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీగా ప్రవీణ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అక్రం పాషా, ఏరిలే ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొట్టే శంకరయ్య, బీ రిలే ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గోడల శ్రీనివాస్, సీ రిలే ఆర్గనైజింగ్ సెక్రెటరీగా తోట వేణు, డీ రిలే ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మేకల సమ్మయ్య ఎన్నికయ్యారు.

హాజీపూర్‌లో పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్, ఎంపీడీవో మధుసూధన్, ఎంపీవో శ్రీనివాసరెడ్డిలు బుధవారం మండల కేంద్రంలో పర్యటించారు. పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారిణి లహరితో సమావేశమై గురువారం గుడిపేట, రాపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. అనంతరం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

కేంద్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు

జన్నారం: లక్సెట్టిపేట ఎస్టీవో, మంచిర్యాల డీటీవోలపై కేంద్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన మేకల అక్షయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యంగా వ్యవహరించి, కోరిన సమాచారాన్ని అందించకపోవడం, రికార్డుల తనిఖీకి అనుమతించక పోవడంతో కార్యాలయాల మొదటి అప్పిలేట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు పేర్కొన్నాడు.

వినూత్న ఆలోచనలకు ప్రయోగాలే కీలకం

చెన్నూర్‌రూరల్: విద్యార్థులలో ఉన్న వినూత్న ఆలోచనలకు జిజ్ఞాస ప్రయోగాలే కీలకమని జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ సూచించారు. మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విజ్ఞానంపై అవగాహన కల్పించారు.

డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ 2024లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఆఫీసర్ వైద్యుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా సోకుతుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి పీజీ కోర్సులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, పీజీ కోఆర్డినేటర్ మేడ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పీజీ రెగ్యులర్ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లిష్ సైన్స్, ఎంకామ్ కోర్సుల నిర్వహణకు కేయూ అనుమతి ఇచ్చిందని, అడ్మిషన్‌ల ప్రక్రియ పూర్తికాగానే తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. పీజీ కోర్సులు అభ్యసించాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 18వ తేదీ నుంచి పీజీ రెండో విడత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024-25విద్యా సంవత్సరంలో పీజీ ఎంట్రెన్స్ రాసిన విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 99592 69975, 99480 75400 నంబర్లను సంప్రదించాలని కోరారు.